www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 15 ఆగస్టు 2023



దేశభక్తిని పెంపొందించుకోవాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దేశభక్తి అందరిలో ఉండాలని, దేశ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగాలని డిఆర్ఒ కృష్ణవేణి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో చినరంగనిపాలెం పస్పుల సాగరం మున్సిపల్ హైస్కూల్లో నామట్టి - నా దేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీని డిఆర్ఒ ప్రారంభించి మాట్లాడారు. నా మట్టి - నా దేశం స్ఫూర్తి దాయకంగా సాగుతోందన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కోడె వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నా మట్టి - నా దేశం కార్యక్రమం స్ఫూర్తినిస్తోందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ ర్యాలీ నిర్వహించారు. లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు కంతేటి వెంకటరాజు, ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ మాట్లాడారు.

బియ్యం పక్కదారి..!

రేషన్ బియ్యం ఇచ్చేది వారే..
కొనేది వారే
కిలో రూ.పదికి కొనుగోలు
వందలాది మెట్రిక్‌టన్నులు పక్కదారి
మార్కెట్‌లో అధిక ధరకు విక్రయం
తూతూమంత్రంగా విజిలెన్స్ తనిఖీలు
యథేచ్ఛగా అమ్మకం.. కొనుగోలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రేషన్ బియ్యం దందా రెండు జిల్లాల్లోనూ యథేచ్ఛగా సాగుతోంది. 'ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడన్న' చందంగా ఈ బియ్యం దందా సాగుతోంది. ప్రభుత్వం రేషన్ సరఫరాకు ఏర్పాటు చేసిన వాహనాల్లోనే ఈ వ్యాపారం సాగడం విశేషం. రేషన్ బియ్యం ఇచ్చేది వారే.. తిరిగి కొనుగోలుచేసేది వారేకావడం విశేషం. జిల్లాలో ఈ తతంగం యథేచ్ఛగా సాగుతోంది. కట్టడి చేయాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు రోడ్లపై వాహనాలు తనఖీచేసి ఒకటి అర పట్టుకోవడం తప్ప.. రేషన్ బియ్యం దందా జరిగే మూలాలపై అధికారులు దృష్టిసారించని పరిస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లో దాదాపు 11.73 లక్షల వరకూ అన్నపూర్ణ, అంత్యోదయ, తెల్ల రేషన్‌కార్డుదారులున్నారు. ఏలూరు జిల్లాలో 6.39 లక్షల వరకూ ఉండగా, పశ్చిమలో 5.33 లక్షలకు పైగాకార్డులున్నాయి. రేషన్ సరుకులు ఇంటికి అందించేవిధంగా ప్రభుత్వం ఎమ్‌డియుఎస్ వాహనాలను ఏర్పాటు చేసింది. ఏలూరు జిల్లాలో 408, పశ్చిమలో 343 మొత్తం 751 రేషన్ వాహనాలున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ప్రతినెలా ఏలూరు జిల్లాలో తొమ్మిదివేలకుపైగా మెట్రిక్ టన్నుల బియ్యం, పశ్చిమగోదావరి జిల్లాలో ఏడువేలకు పైగా మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్‌వాహనాల ద్వారా పంపిణీ అవుతోంది. జిల్లాలో ఎన్నో కుటుంబాలు రేషన్ బియ్యంపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. బియ్యం నాణ్యతలేవన్న కారణంగా దాదాపు 40 శాతం రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు సమాచారం. నాణ్యమైన బియ్యం అందించి రేషన్ బియ్యం అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

రెచ్చిపోతున్న బియ్యం మాఫియా..

రేషన్ కార్డుదారుల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని జిల్లాలో రేషన్ బియ్యం మాఫియా రెంచ్చిపోతుంది. అందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రేషన్ పంపిణీ వాహనాలే వేదికగా మారడం విశేషం. ప్రతినెలా రేషన్ బియ్యం అందించే వాహనదారులే లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. కిలో రూ.పదికి కొనుగోలు చేసి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. ప్రతినెలా ఇది పెద్దఎత్తున సాగుతోంది. నడిరోడ్డుపై ఈ వ్యాపారం సాగిపోతున్నప్పటికీ అడిగే నాథుడే లేకుండా పోయాడు. రేషన్‌వాహనాలను తనిఖీలు చేస్తే ఎన్ని కేజీల బియ్యం విక్రయించారు. వాహనాల్లో ఎంత బియ్యం ఉందో ఇట్టే తెలిసిపోతుంది. అయినప్పటికీ ఏ ఒక్క అధికారీ పట్టించుకోవడం లేదు. సామాన్య ప్రజానీకం నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా తరలించేస్తున్నారు. రోడ్లపై విజిలెన్స్ అధికారులు నిర్వహించే తనిఖీల్లో ఒకటి, అర మాత్రమే పట్టుబడుతున్నాయి. రోడ్లపై తనిఖీలు చేయడం తప్ప అసలు రేషన్ బియ్యం దందా మూలాలను మాత్రం ఏ ఒక్కరూ గుర్తించడం లేదు. రేషన్ వాహనాలు వచ్చిన తర్వాత రేషన్ బియ్యం దందా మూడు పువ్వులు, ఆరుకాయలు అన్నట్లు సాగుతుంది. ఈ దందాకు అడ్డుకట్ట వేయాలని అంతా కోరుతున్నారు. అదే సమయంలో జనాలు మెచ్చే నాణ్యమైన బియ్యం రేషన్ వాహనాల్లో ప్రభుత్వం అందిస్తే ప్రయోజనం ఉంటుంది.



వేడుకలకు సిద్ధమైన కలెక్టరేట్ ప్రాంగణం

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - భీమవరం



కలెక్టర్ ప్రశాంతి

దేశ 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు భీమవరం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. కలెక్టరేట్ పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. జెండా ఆవిష్కరణకు, వేడుకలకు హాజరుకానున్న ముఖ్య అతిథులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు కూర్చోవడానికి వేదికలు సిద్ధం చేశారు. పోలీసులు, ఎన్‌సిసి క్యాడెట్స్ చేసే గౌరవ వందనం, కవాతులకు ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. ఆయా శాఖలకు సంబంధించి స్టాల్స్, శకటాలు ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు చేసేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రోడ్లు భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా హాజరుకానున్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో జాతీయ జెండాను 9.15 నిమిషాలకు ఆవిష్కరించనున్నారు. కలెక్టరేట్‌లో జరిగే వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రశాంతి జెండా ఆవిష్కరించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు.

16 స్టాల్స్ ఏర్పాట్లు, 11 శకటాలు ఏర్పాటు

వివిధ శాఖలకు సంబంధించిన 16 స్టాల్స్, 11 శకటాలను అధికారులు ఏర్పాటు చేశారు. పీడీ, డిఆర్‌డిఎ, ఇడి, ఎస్‌సి కార్పొరేషన్ అండ్ బిసి కార్పొరేషన్, ఎడి డిఫరెంట్లీ ఏబల్డ్, ఇండస్ట్రియల్ డిపార్ట్‌మెంట్స్, ఐసిడిఎస్, మెప్మా, ఫిషరీస్, ఎంఐజి, స్కిల్ డెవలప్‌మెంట్, బ్యాంక్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. అలాగే ఆయా శాఖలకు సంబంధించి 11 శకటాలు ఏర్పాటు చేశారు. దీనిలో సంక్షేమ పథకాలకు సంబంధించి ఇడి ఎస్‌సి అండ్ బిసి కార్పొరేషన్ శాఖ, హౌసింగ్, పశు సంవర్ధక శాఖ, అర్బన్ హెల్త్ క్లినిక్ అండ్ ఫ్యామిలీ ఫిజీషియన్, అగ్రికల్చర్, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, విలేజ్ సెక్రటేరియట్, డ్వామా, ఫైర్ డిపార్ట్‌మెంట్ ఆర్‌డబ్ల్యూఎస్, హార్టీ కల్చర్, జగనన్న సురక్ష, జిజిఎంపి, రీసర్వే, పంచాయతీరాజ్, అర్బన్ రీసర్వే తదితర శాఖల శకటాలు ఏర్పాటు చేశారు. అలాగే జిల్లాలో ఆయా శాఖల నుంచి ఉత్తమ సేవలందించిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు ఇన్‌ఛార్జి మంత్రి దాడిశెట్టి రాజా, కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా అందించనున్నారు. పోలీస్ శాఖకు సంబంధించి 8 సేవా పతకాలు కూడా అందించనున్నారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నాం..

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. వేడుకలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, జిల్లాలోని ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నారు. ఆయా శాఖల ప్రగతిని తెలియజేస్తూ శకటాలు ఆయా శాఖల ద్వారా సేవలు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేశాం. ఆజాద్ ఇక అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నాం.

ఏర్పాట్లను పరిశీలించిన ఆర్‌డిఒ..



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ దాసి రాజు

భీమవరం:స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. సోమవారం కలెక్టరేట్ మైదానంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఏర్పాట్లలో భాగంగా మూడు డయాస్‌లు, 16 స్టాల్స్, వివిధ శాఖలు ఏర్పాటు చేస్తున్న 10 శకటాలను ఆయన పరిశీలించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రోటోకాల్ అనుసరించి సిటింగ్, స్టేజ్, తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టంను పటిష్టంగా ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, మాస్కులు, సానిటైజర్స్, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు, అంబులెన్స్ సేవలు సిద్ధం చేశామన్నారు. ఆయన వెంట డిఎస్‌పి బి.శ్రీనాథ్, వివిధ శాఖలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీదారులను సంతృప్తిపరచాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో వచ్చిన దరఖాస్తులను అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి ప్రజలు నుండి వచ్చిన 206 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన దరఖాస్తులు మళ్లీ రీ ఓపెన్ అవ్వని విధంగా పరిష్కారం చూపాలన్నారు. సుదూర ప్రాంతాల నుండి మన మీద నమ్మకంతో వారి సమస్యల పరిష్కారానికి వస్తారని, అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు.



వినతులు స్వీకరిస్తున్న జెసి రామ్ సుందర్‌రెడ్డి

సమస్యలు ఏకరువు

తాను కులాంతర వివాహం చేసుకున్నాను, తనకు కళ్యాణమస్తు పథకం ద్వారా ప్రభుత్వ సాయం మంజూరు చేయాలని పాలకొల్లు 18వ వార్డు బెత్లహేంపేటలో నివాసం ఉంటున్న కొండేటి దివ్య తెలిపారు. మొగల్తూరు మండలం శేరేపాలెం గ్రామానికి చెందిన కొత్తపల్లి శ్రీనివాసరావుకు చెందిన భూమి కొంతమంది వ్యక్తులు ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని న్యాయం చేయాలని కోరారు. పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామానికి చెందిన గుబ్బల వరలక్ష్మి ఇల్లు కట్టుకున్నానని, తన కుమారుడు ఇంటి నుంచి గెంటేశాడని తిరిగి తన ఇల్లు తనకు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె మల్లికార్జునరావు, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, డిఎస్‌పి బి.శ్రీనాథ్, అధికారులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మారణహోమాన్ని నిరసిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి - పెనుగొండ

మణిపూర్ మారణహోమాన్ని నిరసిస్తూ క్రైస్తవ సోదరులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పెనుగొండ చెరుకువాడ మెయిన్ రోడ్డు మీదుగా ఎస్‌వికెపి కాలేజీ సెంటర్ వరకూ చేపట్టారు. ఈ సందర్భంగా పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడి చెట్టు సుధాకర్ మాట్లాడారు. మణిపూర్‌లో కుకీలపై నెలల తరబడి జరుగుతున్న హింసను అరికట్టడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పాస్టర్లు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.



పెనుగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సోదరులు

భీమవరం రూరల్ : మణిపూర్‌లో హింసను నిలువరించి శాంతిని నెలకొల్పాలని కోరుతూ ఐక్య క్రైస్తవులు శాంతి ర్యాలీ ఆధ్వర్యంలో శివన్నారాయణపురం సదాశివరావుపేట మీదుగా శ్రీరాంపురం వరకూ సోమవారం నిర్వహించారు. అనంతరం వెంప గ్రామంలోని పెద్దపేటలో అంబేద్కర్ విగ్రహానికి, గ్రామ సచివాలయం వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంప గ్రామ సచివాలయ కార్యదర్శి జి.కృష్ణమోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ ర్యాలీకి సిపిఎం సంఘీభావం తెలిపింది. మణిపూర్‌లో మూడు నెలలుగా జరుగుతున్న హింసకాండను నిలువరించి శాంతిని నెలకొల్పాలని, బాధితులకు పునరావాసం కల్పించాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జాన్ మోజెస్ శ్రీనివాస్ పాల్, కె.అప్పలరాజు, పట్టం చిరంజీవి పుచ్చకాయల దేవదాస్, భూపతి శామ్యూల్, వర్ధనపు సుబ్బయ్య పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - ఉండి

పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలిసిపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూడు పంచాయతీ సర్పంచులు, 28 వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మూడో వార్డుకు జరగాల్సిన ఎన్నికలను ఆగస్టు 19వ తేదీన నిర్వహించి, అదేరోజు సాయంత్రం ఫలితాలు వెల్లడించనున్నట్లు తెలిపారు. కలిసిపూడి పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ స్టేషన్‌లోపలికి, బయటకు రాకపోకలకు వీలుగా అదనపు ద్వారంను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జివికె మల్లికార్జునరావు, పంచాయతీ ఎన్నికల జిల్లా నోడల్ అధికారి ఎన్‌విఎస్.శివప్రసాద్ యాదవ్, ఎంపిడిఒ ఎవి.అప్పారావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్‌విఎస్.నాయుడు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

మోడీ పాలనలో కార్పొరేట్లకు స్వాతంత్ర్య ఫలాలు

ప్రకాశం చౌక్ సెంటర్లో ఆట, పాట

ప్రజాశక్తి - భీమవరం

76 ఏళ్ల స్వాతంత్ర కాలంలో నాడు అమరుల స్ఫూర్తితో సాధించుకున్న స్వాతంత్ర ఫలాలు నేడు కార్పొరేట్లుకు మోడీ దోచి పెడుతున్నాడని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ విమర్శించారు. 76వ స్వాతంత్ర దీక్ష సందర్భంగా సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘం, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్ లాంచిల రేవు వద్ద సోమవారం రాత్రి ఆట, పాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపాలన్, సత్యనారాయణ మాట్లాడుతూ నాడు తెల్లదొరల పాలన అంతమొందించాలని, అనేకమంది అమరులు ప్రాణాలర్పించి స్వాతంత్రం సాధిస్తే నేటి పాలకులు కార్పొరేట్లకు దోచిపెడుతున్నారన్నారు. స్వాతంత్ర పోరాటంలో భీమవరానికి ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. రాజ్యాంగంలో స్వాతంత్ర ఫలాలు ప్రజలందరికీ అందాలని ఉంటే నేడు కార్పొరేట్లకే ఫలాలు అందిస్తున్నారని దీనిపై రానున్న రోజుల్లో మరో స్వాతంత్ర పోరాటం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు, సిఐటియు నాయకులు ఎం.వైకుంఠరావు, మల్లిపూడి ఆంజనేయులు, ఎస్.శిరీష, బంగారు పెద్దిరాజు, నీలాపు రాజు, గొర్ల రామకృష్ణ, కలిపిండి సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, చల్లబోయిన వెంకటేశ్వరరావు, బి.వరలక్ష్మి, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.చైతన్య ప్రసాద్, షేక్ వలీ, ఎన్.రంగ, బి.శ్రీరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్

హక్కుల సాధనకు పోరాడుదాం

శెట్టిబలిజ సంక్షేమ సంఘం పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

మంది బలం మెండుగా ఉండి ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు ఓటములు నిర్ణయించ గల దమ్మున్నా అందరికంటే వెనుకబడే ఉండిపోయామని, ఎంతకాలం ఇలా అంటూ శెట్టిబలిజ యువత భీమవరంలో జరిగిన శెట్టిబలిజ సంక్షేమ సంఘం జిల్లా సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో సంఖ్యాపరంగా శెట్టిబలిజలు ఎక్కువగా ఉన్న, దానికి తగ్గట్టుగా జాతికి ప్రయోజనాలు ఉండడం లేదని, రాజకీయ పార్టీలకు ఓటు బ్యాంకుగా మాత్రమే కనిపిస్తున్నామని శెట్టిబలిజ సంఘం పెద్దలు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో భీమవరం, ఉండి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి శెట్టిబలిజ సంక్షేమ సంఘం సమావేశాన్ని సంఘం జిల్లా అధ్యక్షులు కుక్కల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించి మాట్లాడారు. శెట్టిబలిజ సంక్షేమ సంఘం జాతి ప్రయోజనాల కోసం, జాతి హక్కుల సాధన కోసం ఏర్పడిందన్నారు. జిల్లా బిసి సంఘం నేత కోడే యుగంధర్ తన కోడే వీరమ్మ సేవాసమితి ద్వారా రూ.50 వేలు విరాళం ప్రకటించడం అభినందనీయమన్నారు. బిసి నాయకులు వాసర్ల ముత్యాలరావు మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి ఆశ సాధన కోసం శెట్టిబలిజ యువత పని చేయాలన్నారు. ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాటం చేద్దామన్నారు. బిసి సంఘం నాయకులు కోడే యుగంధర్, సంఘం ఉపాధ్యక్షులు జోగి పండు, ఉపాధ్యక్షులు పాలా రాంబాబు మాట్లాడారు. ముందుగా దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు కౌరు శివకృష్ణ, బొక్కా శ్రీను, గూడూరి హనుమంతరావు, సతీష్, వెంకట్, రవి, కడలి ధర్మారావు పాల్గొన్నారు.

బరిలో ఒక సర్పంచి, 10 మంది వార్డు సభ్యులు

19న పోలింగ్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో నిర్వహిస్తున్న పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఒక సర్పంచి, 10 వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు బరిలో నిలిచారు. జిల్లాలో మూడు సర్పంచి పదవులకు, 28 వార్డు మెంబర్లు పదవుల ఎన్నికలకు ఈనెల 8న ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేశారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పాలకొల్లు మండలం అగర్తిపాలెం, యలమంచిలి మండలం దొడ్డిపట్ల సర్పంచి స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఇరవరం మండలం కావలిపురం సర్పంచి పదవికి ఎన్నిక నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 28 వార్డు మెంబర్ల పదవులకు 18 వార్డు మెంబర్ల స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 10 వార్డు మెంబర్ల పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీరవాసరం మండలం మత్స్యపురి, పాలకోడేరు మండలం గొల్లలకోడేరు, పెనుగొండ మండలం దొంగరావిపాలెం, ఇరగవరం మండలం గోటేరు, పెనుమంట్ర మండలం మార్టేరు, తణుకు మండలం తేతలి, పాలకొల్లు మండలం గోరింటాడ, చింతపర్రు, పెంటపాడు మండలం కాసప పెంటపాడు, గణపవరం మండలం గణపవరం వార్డు మెంబర్ల పదవులకు అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. ఒక సర్పంచి పదవికి, 10 వార్డు మెంబర్ల పదవులకు ఈనెల 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, మధ్యాహ్నం రెండు తర్వాత ఓట్ల లెక్కింపు నిర్వహించి ఎన్నికైన అభ్యర్థులను ప్రకటించడం జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు.

వైసిపి హయాంలో పంట కాల్వలు నిర్వీర్యం : ఎంఎల్ఎ రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంట కాలువల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని ఎంఎల్ఎ మంతెన రామరాజు విమర్శించారు. మండలంలోని కలవపూడి, మోడీ గ్రామాల్లో టిడిపి 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకోవడంతోపాటు పెరిగిన విద్యుత్ ఛార్జీలు, గ్యాస్ ధరలు, ఇంటి, చెత్త పన్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో కలవపూడిలో ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరైనా ఈ ప్రభుత్వంపై నమ్మకం లేక నిర్మాణానికి ఏ కాంట్రాక్టరూ ముందుకు రావడం లేదన్నారు. గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులను సైతం వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి నిరంకుశ పాలనతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తేనే ప్రజల సమస్యలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు తోట ఫణిబాబు, అడ్డాల శివరామరాజు, సర్పంచి గేదల జాన్, మంతెన పెద నరసింహారాజు, త్రిమూర్తులరాజు, ముదుండి మణిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ మంతెన రామరాజు

స్పందనకు 14 ఫిర్యాదులు

జిల్లా ఎస్‌పి రవిప్రకాష్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 14 ఫిర్యాదులు వచ్చినట్లు జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ తెలిపారు. సోమవారం స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్‌పి స్వీకరించారు. ఫిర్యాదుల్లో ఎక్కువగా వరకట్న వేధింపులు, సరిహద్దుల గొడవలు, సివిల్ వివాదాలపై వచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదులన్నింటిపై సత్వరమే చట్టప్రకారం విచారణ జరిపి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

కలిసిపూడి మూడో వార్డు ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని కలిసిపూడి మూడో వార్డుకు జరగాల్సిన ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎంపిడిఒ అడబాల వెంకట అప్పారావు తెలిపారు. కలిసిపూడి మూడో వార్డు సభ్యులు కొక్కిరి ఇశ్రాయేలు ఇటీవల మృతి చెందగా ఆయన భార్య కొక్కిరి చింతమ్మకు అన్ని పార్టీలు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవం చేశాయి. కొక్కిరి చింతమ్మ అన్ని రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. దీంతో ఆగస్టు 19న జరగాల్సిన ఎన్నికను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నర్సింగ్ స్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు


ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు అన్నపూర్ణ నర్సింగ్ స్కూలులో వేదాల నాగరాజు అధ్యక్షతన సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదాల నాగరాజు మాట్లాడుతూ వాదించుకుంటే ఎవరో ఒకరే గెలుస్తారని అదే చర్చించుకుంటే ఇరువురికి అంగీకార యోగ్యమైన గెలుపు దక్కుతుందన్నారు. సుప్రీంకోర్టు న్యాయ సేవాధికార సంస్థలను స్థాపించి తద్వారా ప్రజలందరికీ చట్టాలపై అవగాహన కల్పించడం కోసమే న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తుందని చెప్పారు. సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ దేశవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో అన్ని రాజీయోగ్యమైన కేసులను రాజీ చేసుకోవచ్చని చెప్పారు. బార్ అసోసియేషన్ సభ్యులు పిట్టా రాజ్‌కుమార్ మాట్లాడారు. ఈ సదస్సులో నర్సింగ్ లెక్చరర్స్, స్టూడెంట్స్ వారి సమస్యలకు న్యాయపరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. లెక్చరర్స్ కాటం ప్రసాద్, అజయ్ బాబు, విస్సాకోటి అనిత, ఇంజేటి సుధ, ఇ.ప్రశాంతి పాల్గొన్నారు.

మంత్రి రాజాకు ఎంఎల్‌ఎ గ్రంధి పరామర్శ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాను తూర్పుగోదావరి జిల్లా తునిలోని ఆయన నివాసంలో భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. ఇటీవల మంత్రి రాజా తల్లి సత్యనారాయణమ్మ మృతి చెందింది. ఈ నేపథ్యంలో ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ తునిలోని ఆయన నివాసానికి వెళ్లిసత్యనారాయణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజాను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు భీమవరం ఎంపిపి పేరిచర్ల విజయనరసింహరాజు, భీమవరం జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, కొట్టి కుటుంబరావు, నామన మహేష్ ఉన్నారు.



ఎంఎల్‌ఎ మంతెన రామరాజును సత్కరిస్తున్న రామాలయం కమిటీ

కోమటిగుంటలో అన్నదానం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కోమటిగుంటలో కనకదుర్గదేవి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. రామాలయం కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి హోమాలు నిర్వహించారు. ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు విచ్చేసి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. రామాలయం ఆలయ కమిటీ తరుపున ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజును సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ అన్నసమారాధనకు వివిధ ప్రాంతాల నుంచి యాత్రికులు విచ్చేశారు. మాజీ సర్పంచులు యలమంచిలి వెంకటరామ, యలమంచిలి రామాంజనేయులు, టిడిపి గ్రామ అధ్యక్షులు జివిఎన్.సత్యనారాయణ, టిడిపి తెలుగు యువత అధ్యక్షులు మంతెన నాగరాజు నేయులు, టిడిపి గ్రామ నాయకులు సత్యనారాయణ, వెంకటరమణ, వైఎస్ గణపతి, సీసల మాజీ సర్పంచి శ్రీనివాసరావు, వాస్కూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏకాగ్రతతో విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

విద్యార్థులు ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని ఉండ్రాజవరం బౌద్ధధర్మపీఠం గురువు ఆంధ్ర అన్నాలయ అన్నారు. స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పిజి(అటానమస్)లో సబ్సిడైజ్డ్ మిడ్‌డే మీల్స్‌ను కళాశాల యాజమాన్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నాలయ మాట్లాడుతూ భయం, ప్రలోభాలను విడిచి ఏకాగ్రత మైత్రితో జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, వివేకానంద గ్లోబల్ స్కూల్ సెక్రటరీ రీనాసాయి, కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ పాల్గొన్నారు.

రామన్నపాలెంలో 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని రామన్నపాలెం సచివాలయం పరిధిలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దినేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురిని పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నాగజ్యోతి, రామకృష్ణ, ప్రభాకర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సేన సారథ్యంలో జాతీయ జెండాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్‌లో ఆగస్టు15 భారత స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం ఉచితంగా వెయ్యి జాతీయ జెండాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్షులు చవాకుల సూర్య నరేష్‌బాబు, కుంపట్ల రాజా, వంగా నరసింహరావు, మండెల రజిని, ముచ్చర్ల శ్రీనివాస్, గుండుమోగుల వీరస్వామి, బెల్లంకొండ నరసింహరావు, వర్ధినిడి అంజిబాబు, బుర్ర మణికంఠ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కాలువలో వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మురుకు కాలవలో దూకిన వ్యక్తిని రక్షించడానికి వెళ్లిన మరో వ్యక్తి గల్లంతైన సంఘటన భీమవరంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ముందు దూకిన వ్యక్తి సురక్షితంగా బయటపడినప్పటికీ రక్షించడానికి వెళ్లిన వ్యక్తి మురుకు కాలువలో గల్లంతు కావడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన నక్క నవీన్ యనమదుర్రుమురుకు కాలువలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తన అన్నయ్య మందలించాడని మనోవేదనకి గురైన నవీన్ మురుకు కాలువలకు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాలువలోకి దూకిన నవీన్‌ను గమనించిన కానుబోయిన పెద్దిరాజు (18) రక్షించడానికి కాలవలోకి దూకి గల్లంతయ్యాడు. నవీన్ సురక్షితంగా బయటపడినప్పటికీ పెద్దిరాజు మాత్రం తిరిగి రాలేదు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌ టౌన్ పోలీసులు తెలిపారు.

కుమార్తె కనిపించడంలేదని తల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉండి

యువతి అదృశ్యంపై ఉండి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం చెరువుగట్టుపాలేనికి చెందిన దుద్దే వెంకటరమణ కుమార్తె ప్రయివేటుగా డిగ్రీ చదువుకుంటూ ఇంటివద్దనే ఉంటుంది. ఈ క్రమంలో వెంకటరమణ సోమవారం ఉదయం పని నిమిత్తం బయటకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి రాగా ఇంటిలో తన కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతకగా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఉండి పోలీసులకు తల్లి వెంకటరమణ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు తెలిపారు.

అమరులను స్మరించుకోవాలి : కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - ఆకివీడు

దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను ఎన్నటికీ మరువరాదని, వారు చిరస్మరణీయులని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. నా మట్టి- నా దేశం అమరవీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ఆకివీడు వచ్చారు. దేశ సైనికుడిగా పనిచేసి విధి నిర్వహణలో అసువులు బాసిన వీర సైనికుడు గంట్ల వీర వెంకట నాగ గోవర్ధన్ తల్లిదండ్రులు గంట్ల వెంకట్రావు, వెంకటలక్ష్మిలను ఆమె సన్మానించారు. ప్రధానమంత్రి నుంచి అందిన సందేశాన్ని ఆమె వారికి అందించారు. తొలుత గోవర్ధన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ కెవిఎస్.ప్రసాదరావు, డిపిఒ జివికె.మల్లికార్జునరావు, నగర పంచాయతీ చైర్ పర్సన్ జామి హైమావతి, కమిషనర్ కెవి.కృష్ణమోహన్, మాజీ సైనికులు ఎం.సత్యనారాయణ, ఎం.సుబ్రహ్మణ్యేశ్వరరావు, తహశీల్దార్ ఎంబి విజయలక్ష్మి, ఎంపిడిఒ కె.వాణి, ఎంఇఒ ఎ.రవీంద్ర, వాయిస్ సెర్మర్లు పుప్పాల సత్యనారాయణ, వంగా జ్యోత్స్న, అవార్డు కౌన్సిలర్ దొడ్డి జగదీష్ పాల్గొన్నారు.

పెనుమంట్ర :ప్రతి విద్యార్థి త్రివర్ణ పతాకం గురించి అవగాహన కలిగి ఉండాలని నత్తా రామేశ్వరం సర్పంచి వెలగల ధర్మారెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నా భూమి - నా దేశం కార్యక్రమం



పెనుమంట్రలో...

సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి శ్రీశైలపు నాగేంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి విద్యార్థులకు ఆగస్టు 15, స్వాతంత్ర పోరాటంలో అమరవీరుల త్యాగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.నాగమణి, ఉపాధ్యాయురాలు కె.సాయితులసి, సచివాలయ ఉద్యోగులు సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ :ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నా మట్టి - నా దేశం నేల తల్లికి నమస్కారం - వీరులకు వందనం కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, దేశ రక్షణ కోసం పనిచేసిన రక్షణ దళం రిటైర్డ్ ఉద్యోగుల సత్కార వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులు ఆచంట అలివేలు, కామన బాల సత్యనారాయణ, ఆశపు కోటిలాల్‌లను, త్రివిధ దళ రిటైర్డ్ ఉద్యోగులు లెఫ్టినెంట్ కర్నాల్ ఆర్‌కెవి.రావు, సీనియర్ నాన్ కమిషన్డ్ ఆఫీసర్ ఎవి.రమణ, నాయక్, జోగి బాలరాజు, కె.జాన్‌ఫెడరిక్, ఎం.సుధాకర్‌లను ఘనంగా సన్మానించారు.

భీమవరం రూరల్ :డిఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ వారితో యనమదుర్రు గ్రామంలో నా మట్టి-నాదేశం కార్యక్రమం కళాశాల దత్తత గ్రామమైన యనమదుర్రులో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 75 మొక్కలు నాటారు. యనమదుర్రు గ్రామ సెక్రటరీ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటినట్లు చెప్పారు. గ్రామ సర్పంచి బురబత్తుల శ్రీరామమూర్తి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గౌవించుకునేందుకు ఈ ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.అంజాన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.ప్రవీణ్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యాక్రములో డాక్టర్ జిజి.రత్నం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, యమమదుర్రు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లలకోడేరు బరిలో ముగ్గురు అభ్యర్థులు

ప్రజాశక్తి - పాలకోడేరు

గొల్లలకోడేరు ఆరో వార్డుకు ఉప ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో బరిలో ముగ్గురు అభ్యర్థులు నిలిచారు. ఈ నెల ఎనిమిదో తేదీ పంచాయతీ ఎన్నికలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిలో భాగంగా ఈ నెల పదో తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ జరిగింది. దీంతో ఆరో వార్డుకు పది నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఈ నెల 14తో నామినేషన్ల ఉపసంహన గడువు ముగియడంతో ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆరో వార్డుకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం ఆరో వార్డు బరిలో పడమట రామలక్ష్మి, సువ్వాడ మోహిని, సంబలదీవి నాగమణి నిలిచారు. ఇప్పటికే అధికారులు ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులు కూడా కేటాయించారు. ఈ నెల 19న ఆరో వార్డులో ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది.

పాలకొల్లు రూరల్: మండలంలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. మొత్తం ఒక సర్పంచి, ఐదు వార్డులకు ఆగర్తిపాలెం సర్పంచి ఎన్నిక ఏకగ్రీవమైంది. మిగిలిన ఐదు వార్డులకు దగ్గులూరు, దిగమర్రు, వెలివెల గ్రామాల్లో ఒక్కో వార్డుకు నామినేషన్ దాఖలు చేయగా మూడు గ్రామాల్లో గల వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. గోరింటాడ, చింతపర్రు గ్రామాల్లోని వార్డులకు ఒక్కో వార్డుగాను ఇద్దరు అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎంపిడిఒ వెంకటేశ్వరరావు తెలిపారు.

పెనుమంట్ర :మార్టేరులో 14వ వార్డు సభ్యురాలి స్థానానికి ముగ్గురు మహిళలు పోటీలో ఉన్నట్లు ఎన్నికల స్టేజ్ వన్ ఆఫీసర్‌గా ఉన్న ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. పోటీలో ఉన్నవా జాలెం సుచంద్రికకు స్టూలు గుర్తు, కప్పల అనంతలక్ష్మికి ప్రెషర్ కుక్కర్ గుర్తు, కారెం వరలక్ష్మికి గౌను గుర్తులను కేటాయించినట్లు తెలిపారు.

శృంగవృక్షంలో డంపింగ్ యార్డ్ నిర్మించాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షం గ్రామంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆరు వారాలలోపు డంపింగ్ యార్డును నిర్మించాలని జస్టిస్ నైనాల జయసూర్య ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి, జిల్లా కలెక్టర్‌కు, రెవెన్యూ డివిజనల్ అధికారికి, పాలకోడేరు తహశీల్దార్‌కు ఆరు వారాల గడువును నిర్దేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోనే శృంగవృక్షం మేజర్ పంచాయతీ అయినప్పటికీ సుదీర్ఘకాలం నుంచి డంపింగ్ యార్డ్ సమస్య వేధిస్తుంది. ఈ నేపథ్యంలో గ్రామాభివృద్ధి కమిటీ జోక్యం చేసుకుని గ్రామంలో అనేక చోట్ల ప్రభుత్వ స్థలాలున్నాయని, అవి ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకోవాలని, సర్వే నెంబర్లతో సహా హైకోర్టును ఆశ్రయించారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ చొరవ తీసుకుని గ్రామంలో ఎకరంన్నర స్థలం ఉందని, దానిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని హైకోర్టును కోరారు. రిట్ పిటిషన్ నెంబర్ 15304 ఆఫ్ 2023 ప్రకారం ఆరు వారాల్లోగా డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించాలని హై కోర్ట్ న్యాయమూర్తి నైనాల జయసూర్య వివిధ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు గ్రామాభివృద్ధి కమిటీ ప్రజాశక్తికి వెల్లడించింది. దీంతో గ్రామస్తులు గ్రామాభివృద్ధి కమిటీని అభినందించారు.

17న సామాజిక తనిఖీ బహిరంగ వేదిక

ప్రజాశక్తి - ఆకివీడు

ఉపాధి సామాజిక తనిఖీలపై బహిరంగ చర్చావేదిక ఈ నెల 17వ తేదీన ఎంపిడిఒ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వాణి తెలిపారు. గతేడాది ఏప్రిల్ నుంచి 2023 మార్చి నెల చివరి వరకు నిర్వహించిన ఉపాధి హామీ చట్టం పనులపై సామాజిక తనిఖీ ప్రారంభమైందని తెలిపారు. ఈ తనిఖీలు ఈ నెల 16 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. చెరుకుమిల్లి, అయి భీమవరం, అప్పారావుపేట, రాజులపేట, దుంపగడప చినకాపవరం, పెద్ద కాపవరం, కుప్పనపూడి గ్రామాల్లో ఈ నెల 12, 13 తేదీల్లో సామాజిక తనిఖీ, అనంతరం 14వ తేదీన గ్రామసభలు నిర్వహించనున్నారు. మందపాడు, కోళ్లపర్రు, గుమ్ములూరు, చిన్నమిల్లిపాడు, గ్రామాల్లో ఈ నెల14, 15, 16 తేదీల్లో సామాజిక తనిఖీలు 16వ తేదీ గ్రామసభలు, అజమూరులో 15వ తేదీ సామాజిక తనిఖీ 16వ తేదీ గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఈ గ్రామసభలో నిర్వహించిన సమస్యలపై మండలంలో ఒకే వేదికపై చర్చ 17వ తేదీన చర్చ నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాలకొల్లు యూత్ హాస్టల్‌కు రాష్ట్ర ఉత్తమ అవార్డు

పాలకొల్లు :భీమవరంలో నిర్వహించిన యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాలకొల్లు యూనిట్‌కు అత్యున్నత ఆల్ రౌండ్ పెర్ఫార్మెన్స్‌కు మెమొంటో అందించారు. పాలకొల్లు యూనిట్ కార్యదర్శి భీమేశ్వరరావు రాష్ట్ర శాఖ హాస్టల్ డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్‌గా నామినేట్ చేశారు. పాలకొల్లు యూనిట్ వైస్ ఛైర్మన్ డాక్టర్ కెఎస్‌పిఎస్.వర్మ రాష్ట్ర శాఖ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. పాలకొల్లు యూనిట్ ఛైర్మన్ కారుమూరి సూర్యనారాయణ రాష్ట్ర శాఖ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా నామినేట్ అయ్యారు. ఈ సందర్భంగా వీరిని పాలకొల్లు యూత్ హాస్టల్స్ సభ్యులు అభినందించారు.

'ఆడుదాం ఆంధ్రా'ను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లావ్యాప్తంగా క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై కలెక్టర్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో 535 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఆడుదాం ఆంధ్ర అక్టోబరు రెండో తేదీ నుంచి నవంబరు ఎనిమిదో తేదీ వరకు గ్రామ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు విభాగాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు స్పోర్ట్స్ కిట్స్ ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. యోగా, టెన్నికాయిట్, నడక, పరుగుపందెం, జాగింగ్, లెమన్ స్పూన్ పందేలు, ఇతర పేరొందిన సాంప్రదాయ ఆటలు కూడా అదనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ఎవరైతే విజేతలుగా నిలుస్తారో వారికి నగదు బహుమతి, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత సాధిస్తారని చెప్పారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి జరుగుతాయన్నారు. ఈ పోటీలకు 17 ఏళ్లు దాటిన వారు మాత్రమే అర్హులని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్ఒ కె.కృష్ణవేణి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సిఇఒ ఎండి హెచ్.మెహర్‌రాజ్, చీఫ్ కోచ్ ఎం.రమేష్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆందోళన

ప్రజాశక్తి - పెనుగొండ

తమకు ఇళ స్థలాలు కేటాయించాలని మండలంలోని రామన్నపాలెంలో లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇళ్ల స్థలాల కాలనీలో లబ్ధిదారులు టిడిపి ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. అనంతరం సచివాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు బడేటి బ్రహ్మాజీ మాట్లాడుతూ రామన్నపాలెంలో 63 మందికి 163/4 సర్వే నెంబర్‌లో 2009లో అప్పటి రాశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారన్నారు. అప్పటినుంచి ఇళ్ల స్థలాలు కేటాయించలేదన్నారు. వైసిపి అధికారంలోకొచ్చాక ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజును లబ్ధిదారులు పలుమార్లు కలిసి సమస్య వివరించారన్నారు. స్థలాలు ఇస్తామని చెప్పి వారి అనుయాయులు 163/4 సర్వే నెంబర్‌లో కొత్త పట్టాలు మంజూరు చేసి లబ్ధిదారులను మోసం చేశారన్నారు. కొత్తగా పట్టాలు తీసుకున్న ఒక్కొక్క లబ్ధిదారుని నుంచి రూ.60 వేలు చొప్పున వసూలు చేశారన్నారు. న్యాయం కోసం హైకోర్టుకు వెళ్లిన లబ్ధిదారులకు చెందిన స్థలాల్లో కొత్తగా ఇళ్ల పట్టాలు మంజూరు చేయరాదని ఇచ్చిన స్టే మేరకు అధికారులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

పంచాయతీ నిధులను దోచుకున్న జగన్ : టిడిపి

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్రంలో గ్రామ పంచాయతీల నిధులను సిఎం జగన్ దోచుకుని గ్రామాల అభివృద్ధికి అడ్డంకిగా మారాడని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు విమర్శించారు. మండలంలోని వాండ్రం గ్రామంలో పార్టీ గ్రామ అధ్యక్షులు కందుల బలరాం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ రామరాజు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని గ్రామపంచాయతీల ఖాతాలో వేసిన రూ.8,660 కోట్ల పంచాయతీ సర్పంచులకు తెలియకుండా సిఎం జగన్ దోచుకున్నాడని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే రాష్ట్రం ఆర్థిక అభివృద్ధిలో దూసుకుపోతుందని, ప్రతిఒక్కరికీ ఇప్పటికంటే అధికంగా సంక్షేమ పథకాలు అందిస్తామని వివరించి ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారుఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కన్నెగంటి రూత్‌కళ, మండల మహిళా అధ్యక్షురాలు వత్సవాయి సుజాత, నియోజకవర్గ యువత అధ్యక్షుడు హరినాయుడు, నాయకులు జుత్తిగ శ్రీనివాస్, కిన్నెర వెంకన్న, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, కాగిత మహంకాళి, మంతెన సాయిలచ్చిరాజు పాల్గొన్నారు.

పోడూరు :మండలంలోని పండితవిల్లూరు గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో సోమవారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, రాష్ట్ర మహిళా నాయకురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి మహానాడులో ప్రకటించిన పథకాలను, మహాశక్తి ద్వారా మహిళలకు అందే పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి తీసుకొచ్చేలా స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు వచ్చి హారతులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యానారాయణరాజు, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ రుద్దరాజు రవిరాజు, గణపతినీడి రామమోహన్, కోరిపల్లి రాము, దొంగ సూర్యప్రసాద్, గంధం వెంకటరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు : టిడిపి మహాశక్తి కార్యక్రమం సోమవారం పాలకొల్లు పట్టణంలోని 26, 27 వార్డుల్లో తెలుగు మహిళల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మహిళలతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు కర్నేని రోజారమణి, పెచ్చెట్టి బాబు, ఎస్తేరు రాణి, పెండ్యాల భవాని, విజయలక్ష్మి, బీర వెంకటరమణ, వరలక్ష్మి, నాగలక్ష్మి, లక్ష్మి జ్యోతి, రమణ, మాలతి, అవినాష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ ఛాంపియన్‌గా జిల్లా జట్టు


ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ జూనియర్స్ అండర్-20 బాయ్స్ గర్ల్స్ ఛాంపియన్‌షిప్ 23-24 పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిందని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.సత్యనారాయణరాజు తెలిపారు. రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ జూనియర్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. అర్ధరాత్రి వరకు జరిగిన పోటీల ఫలితాలను సోమవారం ఉదయం మీడియాకు విడుదల చేశారు. విజేతలకు పశ్చిమగోదావరి జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎవి.సుబ్బరాజు, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ఉపాధ్యక్షులు ఎస్‌వి రంగరాజు, భీమవరం డిఎస్‌పి బి.శ్రీకాంత్ బహుమతులు అందించారని ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జిఎస్‌వి.కృష్ణమోహన్ తెలిపారు. ఇక్కడ జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు వచ్చే నెలలో గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో కూడా రాష్ట్ర అసోసియేషన్ తరపున పాల్గొనేందుకు అర్హత పొందారని తెలిపారు. కృష్ణమోహన్ ముగింపు ఉపన్యాసం ఇస్తూ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల ఏర్పాటుకు సహకారం అందించిన ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల పాలకవర్గానికి, ప్రిన్సిపల్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎంతోమంది త్యాగాల ఫలితమే దేశానికి స్వాతంత్రం వచ్చిందని, భవిష్యత్తు తరాల వారికి స్వాతంత్ర ఫలాలు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని విస్సాకోడేరు సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ డిఆర్.స్వర్ణలత అన్నారు. సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆధ్వర్యంలో 76వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని 300 మీటర్ల జాతీయ జెండాను సోమవారం ప్రదర్శించారు. హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయలు ఉపాధ్యాయేతర సిబ్బంది భారీ జెండాను చేత పట్టుకుని గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేశారు. దేశం గొప్పతనం గురించి వివరించారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామంలో క్విట్ ఇండియా ఉద్యమంలో ఎంతోమంది ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పి.రీచీ జాన్ కిట్స్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.



పాలకోడేరు : జాతీయ జెండాతో విద్యార్థులు

భీమవరం రూరల్ : డాక్టర్ రమణరాజు అంధ పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అంధ బాలలు రమ్య, రాధిక, అనూష (ఇంటర్ విద్యార్థులు) గేయలతో అందరినీ అలరించారు. పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ రమణరాజు మాట్లాడుతూ వికలాంగులు, బధిరులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించడంతో వారిలో దేశభక్తి చైతన్యం కలుగుతుందన్నారు. ఇక్కడ విద్యార్థులు ప్రపంచ విషయాలపై అవగాహనతో ఉంటున్నారని, ఈ స్కూల్ స్థాపన నుంచి రంగసాయి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఇదొక దేవాలయంగా భావిస్తున్నామని, అంధుల జీవితాల్లో వెలుగులు నింపుతూ వారికి సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్‌డిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మనిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.అమూల్యరావు, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : నరసాపురంలో శ్రీ సూర్య జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 200 అడుగుల త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, కళాశాల నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సూర్య కళాశాల కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ మాట్లాడుతూ ప్రధాని పిలుపు మేరకు ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఎగరావేయలన్నారు. ప్రతి ఒక్కరూ దేశం పట్ల దేశ భక్తి కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

9న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి - తణుకు రూరల్

సెప్టెంబర్ తొమ్మిదో తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరామ్, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పివిఎన్.రంజిత్‌కుమార్ కోరారు. సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని స్థానిక కోర్టు ప్రాంగణంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ పెండింగ్ కేసులు రాజీ చేయాలని పోలీసులను కోరారు. ఈ సమావేశంలో తణుకు, ఉండ్రాజవరం, పెనుమంట్ర, పెనుగొండ, అత్తిలి, ఇరగవరం, పెరవలి పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఉండి

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించే వారు తెలియని మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. లాటరీ తగిలిందని ఫేక్ కాల్స్ చేసే సైబర్ నేరగాళ్లకు మీ పూర్తి సమాచారాన్ని ఇవ్వవద్దన్నారు. ఒక వ్యాపారంలో తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ లాభాన్ని ఆర్జించవచ్చని సైబర్ నేరగాళ్లు చెప్పే మోసపూరిత మాటలను నమ్మి డబ్బులను పోగొట్టుకోవద్దన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన లింక్‌లను ఓపెన్ చేయకుండా, ఆన్‌లైన్ తెలియని వారితో లావాదేవీలు జరపకుండా ఉండటమే దీనికి సరైన పరిష్కారమని తెలిపారు.

పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పురపాలక సంఘ పరిధిలోని వివిధ ప్రాంతంలో ఆవులు, గేదెలు, పందులు పట్టణంలోని రోడ్లపై వెళ్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగజేయడమే కాకుండా ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. పలు ప్రాంతాల్లో అపరిశుభ్రతకు కారణమై ప్రజా ఆరోగ్యానికి భంగం కలుగుతుందన్నారు. పట్టణ పరిధిలోని యజమానులు ఆవులు, గేదెలు, పందులను ప్రజా అవాసాలకు దూరంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా సరంక్షించుకోవాలన్నారు. లేకపోతే జరిమానా విధిస్తామని తెలిపారు.

హాస్టల్‌కు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

యూత్ హాస్టల్స్ అసోసియేషన్ అఫ్ ఇండియా న్యూ ఢిల్లీ అభ్యర్థన మేరకు "సుమపుర ఇంటర్నేషనల్ యూత్ హాస్టల్, క్యాంప్ సైట్ డెవలప్‌మెంట్ ఫండ్" నిమిత్తం భీమవరం యూత్ హాస్టల్స్ యూనిట్ నుంచి రూ.1,11,116 సేకరించారని యూనిట్ ఛైర్మన్ మట్టపూడి సత్యనారాయణ, కార్యదర్శి నందమూరి రాజేష్ తెలిపారు. సేకరించిన రూ.1,11,116 విరాళాన్ని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ వివిజె.సోమరాజు, ఛైర్మన్, చీమల రవిపాల్‌లకు అందించారు. హిమాచల్ ప్రదేశ్ కులులోని ఇంటర్నేషనల్ యూత్ హాస్టల్స్ భవనం, క్యాంపు సైట్ అభివృద్ధి చేయడానికి యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఈ విరాళాన్ని వినియోగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆరేటి వెంకట సత్యనారాయణ, డాక్టర్ కత్రెడ్డి సత్యనారాయణ, పాండు రంగారావు, తాళ్లపూడి గాంధీ, కటికరెడ్డి వెంకటరత్నం, జానపాటి మధుసూదనరావు, చెన్నంశెట్టి గణపతిరావు, కడియం ఈశ్వరరావు, నెదురీ సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

'దోచుకోవడం టిడిపి నైజం'

ప్రజాశక్తి - ఉండి

పార్టీ అధికారంలో ఉండగా దోచుకోవడం, దాచుకోవడం టిడిపి నైజం అని వైసిపి ఉండి నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. ఉండి కూనపురాజు అప్పలరాజు సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన వైసిపి ఉండి మండల కార్యకర్తల సమీక్ష సమావేశంలో పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పార్టీని పటిష్ట పరచి ఉండి నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగురవేయడానికి సిద్ధంగా ఉన్నామని శ్రీలక్ష్మికి తెలిపారు. ఎఎంసి ఛైర్మన్ పదవి పూర్తయి సంవత్సరం గడిచినా ఇప్పటివరకు ఆ స్థానాన్ని భర్తీ చేయకపోవడం పట్ల పలువురు నాయకులు శ్రీలక్ష్మి ఎదుట అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో అక్కడక్కడ కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని అధిష్టానం దృష్టిలో పెట్టి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స రామకృష్ణ ఆంజనేయరాజు, ఉండి గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టిముక్కల కల్యాణ్ వర్మ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జెడ్‌పిటిసి సభ్యులు రణస్థల కనకదుర్గ మహంకాళి, పార్టీ గ్రామ అధ్యక్షులు మల్లికార్జున పాల్గొన్నారు.